గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో శంకుస్థాపనలు

- రూ.175 కోట్లను రద్దు చేసిన కాంగ్రెస్ సర్కార్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్30: గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నేడు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ గతం ప్రభుత్వంలో ఆర్‌సీఐ రోడ్డు నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు రూ. 32 కోట్లతో 150 ఫీట్ల రోడ్డును 2.60 కిలో మీటర్ల వరకు వేయడానికి నిధులు కేటాయించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టలేదన్నారు. ఏ శాఖల పైన అవగాహన లేకుండా పాలన కొనసాగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఏరంగంలో చూసిన అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు కన్పిస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మహేశ్వరం నియోజక వర్గం ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ 13 బస్తీ దవాఖానలు, 9 అర్బన్ సెంటర్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అందులో ఆరు బస్తీ దవాఖానలను ప్రారంభించుకున్నామన్నారు. కొన్ని బస్తీ దవాఖానల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 3 అర్బన్ సెంటర్లు ప్రారంభం కాగా మిగతావి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అర్బన్ సెంటర్లకు గత ప్రభుత్వం రూ.1.43 కోట్లు కేటాయించిందన్నారు. మైనార్టీ ప్రాంతంలో ఉన్న ముస్లిం ప్రజలకు వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ సర్కార్ ప్రజల సమస్యలను గాలికి వదిలేసి కక్ష పూరిత చర్యలకు దిగుతుందన్నారు. నియోజక వర్గానికి మంజూరైన రూ.175 కోట్ల నిధులు రద్దు చేయడం జరిగిందన్నారు. రద్దు చేసిన నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 100 పడకల దవాఖాన మంజూరు చేశామని, ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉందన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

సీఎం సహాయనిధితో ఎంతో మంది పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. కొత్తపేటలోని తన నివాసంలో సూర్యాపేట జిల్లా ఆత్మకూరుకు చెందిన స్వప్నకు రూ. 44 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన వైద్య సేవలను సీఎం రిలీఫ్ ఫండ్‌తో అందుకునేందుకు అవకాశం ఉందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మందికి ఉత్తమ వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు.
–ఎల్బీనగర్, నవంబర్ 30:

కందుకూరును మున్సిపాలిటీ చేయొద్దు

- నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి
- మంత్రి శ్రీధర్‌బాబును కోరిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- నేదునూరులో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

నేదునూరులో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు,నవంబర్30: ప్రభుత్వం కందుకూరును మున్సిపాలిటీ చేసే ఆలోచనను విరమించుకోవాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. ఈ విషయంలో జిల్లా ఇన్‌చార్జి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చొరవ తీసుకోవాలని ఆమె కోరారు. మండల పరిధిలోని నేదనూరు గ్రామం నుంచి మద్దెల చెర్వు తండా వరకు రూ. 17 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు నేదునూరు వద్ద మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కందుకూరును మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే పేద ప్రజలకు ఇబ్బందులు వస్తాయని, ఉపాధి కూలీలకు పనులు దొరకక అవస్థలు పడుతారని, పేద ప్రజలపై పన్నుల భారం పడుతుందన్నారు. దీని వల్ల ప్రతి ఒక్కరికీ అన్యాయం జరుగుతుందన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటులో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. నియోజవర్గం అభివృద్ధికి అత్యధికంగా నిధులను కేటాయించాలని కోరారు. అర్బన్ ఫైనాన్స్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, మాజీ జడ్పీటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, వైస్ మాజీ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ క్రిష్ణానాయక్, మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, సీఏపీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ కాసుల రామక్రిష్ణారెడ్డి, ఏనుగు శ్రావణి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, మేఘనాథ్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సరికొండ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిన సర్కార్

విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, నవంబర్ 30 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం మండలపరిధిలోని కొత్తగూడలో గల కస్తూర్బా బాలికల పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాల స్థితిగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని శుభ్రత పాటించాలన్నారు. ముఖ్యంగా మూత్ర శాలలు పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్ భార్గవికి సూచించారు. విద్యార్థులకు ఎప్పుడు కష్టం వచ్చిన నేను అండగా ఉంటానని తనకు ఫోన్ చేయండని ఫోన్ నంబర్ ఇచ్చారు. భోజన శాల, వంటగది, సామగ్రి, కూరగాయాలు, బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగామాడుతుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా తయారు చేస్తే ఈ ప్రభుత్వం కనీసం నిర్వహణ సక్రమంగా చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్, ఎలుక మేఘనాథ్‌రెడ్డి, ఆనేగౌని దామోదర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి , డైరెక్టర్లు పొట్టి ఆనంద్, సురుసాని శేఖర్‌రెడ్డి, యూత్ నాయకులు తాళ్ల కార్తీక్, సురుసాని సుదర్శన్ రెడ్డి, కొండల్‌రెడ్డి, సురుసాని క్రిష్ణారెడ్డి, మాజీ డైరెక్టర్లు సామ ప్రకాశ్‌రెడ్డి, దేవీలాల్ నాయక్,రవీందర్‌రెడ్డి, బర్కం వెంకటేశ్, న వీన్, ప్రిన్సిపాల్ భార్గవి విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలి

కందుకూరు రైతువేదికలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేశ్

కందుకూరు. నవంబర్ 30 : రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలని రంగారెడ్డి జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సురేశ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మామిడి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పండ్ల తోటల రైతులకు పట్టుపరిశ్రమ, ఉద్యాన వనశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పూత దశలో మామిడి తోటలో తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులకు సూచించారు. కూరగాయల పంటలలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్‌లను ఏర్పాటు చేసుకున్నట్లయితే నాలుగేండ్ల అనంతరం ఎకరాకు ఐదు వేల వరకు ఆదాయం వస్తుందని చెప్పారు. డ్రిప్, స్ప్రింకర్లను రాయితీపై ఇస్తుందని తెలిపారు. రైతులు లాభసాటి పంటలను వేసుకోవాలని సూచించారు. రైతులు ఆర్థికంగా ఎదగటానికి పండ్ల తోటలతో పాటు కూరగాయల పంటలను వేసుకోవాలని కోరారు. సీఆర్ఐడీ సైంటిస్టు శ్రీకృష్ణ, మండల ఉద్యానవన అధికారి సౌమ్య, మండల వ్యవసాయ అధికారి కృష్ణమోహన్, ఏఈఓ రాజు, ప్రమోద్, మల్లేశ్, రైతులు బొక్క లోకేశ్వర్‌రెడ్డి, బొక్క ప్రతాప్‌రెడ్డి, మక్తల వెంకటేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఇద్దరు మృతి

కాచిగూడ, నవంబర్ 30 : వేర్వేరు చోట్ల రైలు ఢీకొని ఇద్దరు గుర్తు తెలి యని వ్యక్తులు మృతిచెందారు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి (55) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు గోధుమ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడనితెలిపారు.

మరో ఘటనలో..

పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గుర్తుతెలియని వృద్ధుడు(65) శనివారం ఉప్పుగూడ–యాకుత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని కాచిగూడ రైల్వే పోలీసులు ఉస్మానియా దవాఖానకు తరలించారు.

విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు

మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకుడు సిద్ధు

కందుకూరు, నవంబర్ 30: సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకుడు సిద్ధు విమర్శించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కందుకూరులో విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. వరుస సంఘటనలు జరుగుతున్న ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్లు లేదని తెలిపారు. బాధ్యులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్య ప్రైవేటీకరణకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులను కల్పించాలని కోరారు. వెంటనే ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరా రు.నాయకులు వినోద్, ప్రశాంత్,చరణ్, అక్షయ్, వేణు, సందీప్, రాఘవేందర్ పాల్గొన్నారు.

మాలల సింహగర్జన జయప్రదం చేయాలి

ఎల్బీనగర్, నవంబర్ 30: మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్లు సత్యనారాయణ, కొంగర నర్సింహారావు, రాష్ట్ర నాయకుడు పార్శపు శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన సభకు 35లక్షల మంది మాలలు తమ సత్తా చాటే రీతిలో విచ్చేయనున్నారని వారు వివరించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పదకొండు డివిజన్లు, మహేశ్వరం నియోజకవర్గంలోని రెండు డివిజన్ల నుంచి సుమారు 2వేలకు పైగా మాలల కుటుంబాలు పరేడ్ గ్రౌండ్‌కు తరలనున్నాయని అన్నారు. ప్రతి డివిజన్‌లో మాలలను కలిసి చైతన్యం చేయడంతో పాటుగా ర్యాలీగా సభకు తరలివెళ్లేందుకు నాయకులంతా కలసికట్టుగా ముందడుగు వేస్తున్నామన్నారు. డివిజన్లలో సీనియర్ నాయకులు టేకుమల్ల మహేశ్‌కుమార్, గంగం శివశంకర్, చేపూరి శంకర్, కడారి పెంటయ్య, సంఘి సహదేవ్, సతీశ్, కట్టా వెంకటేశ్, మద్దెల నర్సింహ, సునీల్‌బాబు, చంగల్ చంద్రమోహన్, మెరుగుమల్ల శ్రీకాంత్, పెద్దయ్య, నరేశ్, రెడ్డిమాల పెద్ద కృష్ణ, శ్యాం స్వామి, సంజీవ, ఎల్లేశ్వర్, రాజు, మద్దెల నరేశ్, మోరు సురేశ్, పరమేశ్, సా యి, నాగమల్ల భిక్షపతి, లింగస్వామి, శ్రీనివాస్‌లతో పాటుగా మాల సంఘాల నాయకుల ఆధ్వర్య ంలో పెద్ద ఎత్తున పరేడ్ గ్రౌండ్‌కు తరలిరా నున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడం

సలీంనగర్ కాలనీ బస్తీ దవాఖాన వద్ద సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్దుల్లా బలాల

మలక్‌పేట, నవంబర్ 30: మూసారాంబాగ్ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల తెలిపారు. డివిజన్ పరిధిలోని అరోరా కళాశాల వీధి, శాలివాహననగర్ పార్కు, సాయినగర్ కాలనీ, ఇంద్రానగర్, గడ్డిఅన్నారం బస్తీ దవాఖాన, బాలాజీ స్వీట్ హౌజ్, ఫర్హత్ నర్సింగ్ హోం, సలీంనగర్, బస్తీ దవాఖాన వీధి తదితర ప్రాంతాల్లో రూ. 1.5 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను శనివారం ఆయన స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియంలో కాలనీల వాసులు, జీహెచ్ఎంసీ వివిధ శాఖల అధికారులతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూసారాంబాగ్ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 70 శాతం కాలనీల్లో రోడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేశామని, కొన్ని రోడ్లకు శంకుస్థాపనలు జరగగా, కొన్ని రోడ్లకు నిధులు మంజూరు చేశామని, కొన్ని ప్రతిపాదనల దశలో ఉన్నాయని అన్నారు. రోడ్లను నాణ్యతగా నిర్మించేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అన్నిశాఖల అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని, మరమ్మతు పనులుగాని, కొత్త పనుల నిర్మాణాలకు సంబంధించిన పనులు విషయం కానీ అధికారులతో చర్చించాలని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పార్కులు, ప్లే గ్రౌండ్ల అభివృద్ధి, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎంతమాత్రం రాజీ పడేదిలేదని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బీ మలక్‌పేట డీజీఎం హష్మత్ అలీ, మూసారాంబాగ్ డివిజన్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు ప్రీతి, ఇంజినీరింగ్ విభాగం డీఈ,ఎఈ,పారిశుధ్య విభాగం అధికారులు, సలీంనగర్ కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఫర్వేజ్ హబీబ్ ఉర్ రహమాన్, ఎండీ తౌసీఫ్ మొహియుద్దీన్, షేక్ పాహద్ హుస్సేన్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న ప్రతిభా పురస్కారాలు

కాచిగూడ, నవంబర్ 30 : 2024 సంవత్సరంలో డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో 80 శాతం మార్కులు సాధించిన తెలంగాణ వ్యాప్తంగా అనాథ మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఆర్థికసాయాన్ని అందజే యనున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్రావు శనివారం తెలిపారు. తల్లిదండ్రులు, సంరక్షకుల్ని కోల్పోయిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం 11గంటలకు కాచిగూడలోని మున్నూరుకాపు సంఘంలో అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. పూర్తి వివరాలకు 040–24658160, 9491627404లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ట్రస్టీలు పి. విష్ణువర్ధన్, పిల్లి శ్రీనివాస్‌రావు, ఆకుల నగేశ్, దేవేందర్, చంద్రశేఖర్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

నేడు కార్తీక వనభోజనాలు

అంబర్‌పేట,నవంబర్ 30: అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నేడు ఉస్మానియా యూనివర్సిటీలోని ఫ్యాకల్టీ క్లబ్‌లో కార్తిక వనభోజనాలు, పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, కార్యదర్శి శివకుమార్, కోశాధికారి బి.అశోక్ తెలిపారు. వనభోజనాలకు ముఖ్యఅతిథులుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు రాన్నుట్లు తెలిపారు. నియోజకవర్గం పద్మశాలి కుటుంబ సభ్యులంతా ఆదివారం ఉదయం 10గంటలకు హాజరు కావాలని వారు కోరారు.

ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

అంబర్‌పేట, నవంబర్ 30 : క్రీడలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య సూచించారు. డీడీ కాలనీ, నల్లకుంట, గాంధీనగర్, హిమాయత్‌నగర్ బ్రాంచీల బచ్‌పన్ స్కూల్స్ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ డీసీపీ నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే చదువుకు సార్థకత అవుతుందని సూచించారు. శారీరక దృఢత్వాన్ని పెంచడానికి క్రీడలు మరింత ఉపయోగపడుతాయన్నారు. కార్యకమంలో రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య

'సమ్మాన్యుడు' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 30. సిరివెన్నెల సీతారామశాస్త్రి విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగించిన కర్మయోగి అని వక్తలు శ్లాఘించారు. అక్షజ్ఞ పబ్లికేషన్ ఆధ్వర్యంలో సిరివెన్నెల సుమధుర జ్ఞాపకాలతో కూడిన కార్యక్రమం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం ఆద్యంతం సిరివెన్నెల సీతారామశాస్త్రి జీవిత విశేషాలతో సాగింది. రచయిత చేబోలు శ్రీరామశాస్త్రి సంకలనం చేసిన సిరివెన్నెల తొలిగురువు 'సమ్మాన్యుడు' పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు. ఏపీ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, రచయితలు, పాత్రికేయులు ఎంవీఆర్ శాస్త్రి, గుండు వల్లీశ్వర్, వైద్యులు డాక్టర్ పన్నాల కృష్ణ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కేవీఎస్ఎస్ఆర్‌కే శాస్త్రి, కౌముది అంతర్జాల పత్రిక సంచాలకులు కిరణ్ ప్రభ, చలనచిత్ర దర్శకులు కృష్ణవంశీ పాల్గొన్నారు. సిరివెన్నెల రచనలోని పలు గీతాలను పలువురు గాయనీగాయకులు శ్రావ్యంగా ఆలపించి సంగీతప్రియులను అలరించారు.

శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించాలి

రవీంద్రభారతి, నవంబర్ 30 : శాస్త్రీయ కళారూపాయలను ప్రోత్సహించడం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత రంగస్థలం అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30 రోజుల సైద్ధాంతిక కూచిపూడి నాట్య శిక్షణ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా నాట్యగురువులు సంగం భట్ల నరసయ్య, ఇందిరాహేమ, సీహెచ్ నారాయణమూర్తి, నాట్య మార్గం పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకున్నది.

సుజాతకు మధుర గాయని పురస్కారం

సినీ నేపథ్యగాయని సుజాతకు ప్రాజ్ఞిక–సీల్‌వెల్ బహుముఖ మధుర గాయని పురస్కారాన్ని అందజేస్తున్న సంగీత దర్శకుడు రాధాకృష్ణ తదితరులు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 30 : ప్రాజ్ఞిక ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో శనివారం జానకమ్మ స్వరవైభవం శీర్షికన నిర్వహించిన సంగీత విభావరి ఆద్యంతం సంగీత ప్రియులను ఓలలాడించింది. సినీ నేపథ్యగాయని సుజాత ప్రముఖ గాయని జానకమ్మ ఆలపించిన 35 మధుర గీతాలను ఆలపించి రసజ్ఞులైన సంగీత ప్రియుల కరతాళధ్వనులందుకున్నారు. అనంతరం జరిగిన సభలో సుజాతకు ప్రాజ్ఞిక–సీల్‌వెల్ సభ్యులు బహుముఖ మధుర గాయని అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ సంగీతదర్శకులు కేఎం రాధాకృష్ణ, సింగర్ సింహ పాల్గొని జానకమ్మ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ప్రాజ్ఞిక వ్యవస్థాపకులు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి సుజాత, గాయకులు సిద్ధు, సురేశ్, వెంకీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేయాలి

అంబర్‌పేట, నవంబర్ 30: తరతరాలుగా అనుభవిస్తున్న ఎస్సీ రిజర్వేషన్లను కొంత మంది మాల వ్యతిరేక శక్తులు ఏబీసీడీలు కాకుండా అడ్డుకుంటున్నాయని ఎమ్మార్పీఎస్ ఆరోపించింది. ఎస్సీ వర్గీకరణ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఎమ్మార్పీఎస్ అధిష్ఠానం పిలుపుమేరకు శనివారం భారీ ఎత్తున బైక్ ర్యాలీని నిర్వహించారు.

ట్రేడ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి, నవంబర్ 30: తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెహమాన్ బాబా సంస్థ నిర్వహిస్తున్న ట్రేడ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ వాల్‌పోస్టర్‌ను శనివారం రవీంద్రభారతిలోని ప్రాంగణంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్